లోకేష్ బహిరంగ సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర -కనిగిరి : కనిగిరిలో జరిగే యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం పామూరు బస్టాండ్‌లో జరిగే బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, సిఎస్పురం, పీసీ పల్లి, హనుమంతునిపాడు మండలాల నుంచి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేల సంఖ్యలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ,నాయకులు ప్రైవేటు బస్సులు, కార్లు, ఆటోలు ఇతర వాహనాల్లో ఉదయం నుంచే కనిగిరికి చేరుకున్నారు. వారంతా నారా లోకేష్ బస చేసిన ప్రాంతానికి చేరుకొని పాదయాత్ర అడుగులో అడుగు కలిపి పాటు బహిరంగ సభ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర- చీమకుర్తి : చీమకుర్తి పట్టణం లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నర్చర్ ద నేచర్ సాఫ్ట్ స్కిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా ర్యాలీ లో పాల్గొన్న నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ వై రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం మనఅందరి బాధ్యత అని, ప్రకృతి వనరులను కాపాడుకోక పోతే భావి తరాలు వారికి ఇబ్బందులు వస్తాయిని, అందుకోసం ప్రతి ఒక్కరి బాధ్యత గా ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు . ఈ సందర్భంగా స్కూల్ వద్ద నుండి బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతికి ని కాపాడుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సాఫ్ట్ స్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వాహన సౌకర్యం ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర - సంతనూతలపాడు: వైసీపీ నాయకులుదాత శనగల జయరామి రెడ్డిపేద విద్యార్థులకు వాహన సౌకర్యం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎం ఈ ఓ డి వెంకారెడ్డి అన్నారు. మండలంలోని బొద్దు వారి పాలెం గ్రామ వైపీపీ నాయకులు దాత శనగల జయరామిరెడ్డి అదే గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీ విద్యార్థులు బడికి వెళ్ళుటకు వాహన సౌకర్యం లేక ఇబ్బందులు పడటంతో బాల బాలికలు చదువుకు దూరమవుతున్నారని గుర్తించి మంచి హృదయంతో గురువారంచంద్ర పాలెం ఎంపీపీ స్కూల్ చేర్పించి వారి ఆర్థిక సహాయంతో ఒక ఆటో సౌకర్యం ఏర్పాటుచేశారు. పలువురు దాత శనగల జయరామిరెడ్డి, వారి కుమారుడు మహిధర్ రెడ్డిలనుప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వెల్ఫర్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు, సర్పంచ్ బొద్దు రామారావు, వైసీపీ నాయకులు నల్లూరి భాస్కరరావు,మొనపాటి కృష్ణ కిషోర్, సచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - చీమకుర్తి : 108 దివ్య దేశాల అఖండ లక్ష్మి నారసింహ క్షేత్రల లో నిర్వహిస్తున్న పూజలలో భాగంగా ఉత్తర ఖండ్ రాష్ట్రం లోని మహా ప్రసిద్ధి పుణ్యక్షేత్రం అయిన హరిద్వార్ నందు శ్రీ సాయి గురుస్వామి గురువు ఆధ్వర్య ంలో జరుగుతున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి మహాయజ్ఞం లో మద్దిపాడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పిచ్చిమ్మ దంపతులు పాల్గొన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం నందు విఖసన సుధర్మ సేవా సమితి సాయి గురు స్వామి ఆధ్వర్యంలో జరుగు హెూమాలు,పూజలలో పాల్గొనడం చాలా సంతోషం ఉందని మారం వెంకారెడ్డి తెలిపారు.

శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - సింగరాయకొండ : మండలం సోమరాజు పల్లి పంచాయతీ అప్పాపురం గిరిజన కాలనీ నందు సమరసత్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానములో శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నిర్మించి విగ్రహ ప్రతి ష్టాపన కార్యక్రమం గురువారం వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమానికి సమర సత సేవా ఫౌండేషన్ సింహపురి జోనల్ కన్వీనర్ నారిపెద్ది గోపాల్ రావు, ప్రకాశం జిల్లా కన్వీనర్ వెంకట్, ప్రకాశం జిల్లా బాలవికాస్ కన్వీనర్ అగ్రిబోయిన రాంబాబు, స్థానిక సర్పంచ్ తనయుడు యన్నా బత్తిన కార్తీక్ పాల్గొన్నారు. గోపాల్ రావు మాట్లాడుతూ హిందూ ధర్మం సనాతనమైనదని ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని స్వధర్మం లోనే అందరూ జీవించాలని సూచించారు. సర్పంచ్ తనయుడు కార్తీక్ మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు మనం దరం కట్టుబడి ఉండాలని ఆలయాల నిర్మాణానికి ఇతర అభివృద్ధి కార్య క్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. భాజపా కొండపి నియోజక వర్గ కన్వీనర్ మిడసల బాలకోటయ్య, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అచ్యుత చెంచు సుబ్బారావు గ్రామ పెద్దలు, భక్తులు, ధర్మ ప్రచారకులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానం కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా సీతారామస్వామి కోలాటం బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం, భజనలు భక్తులను విశేషంగా అలరించాయి.

కాటమరాజు గడ్డపై పాదయాత్ర నా అదృష్టం

- ఉమ్మడి ప్రకాశం జిల్లాకు జగన్ వరగబెట్టిందేమీ లేదు
- బాబాయ్ మర్డర్ జగనాసుర రక్త చరిత్రే..
- జగన్ మహిళల్ని నమ్మించి మోసం చేశాడు.. మీ కష్టాలు చూసాను కన్నీళ్లు తుడుస్తాను
- బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు అండగా తెలుగుదేశం
- జగన్ కటింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్
- టీడీపీ కార్యకర్తలను వేధించిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తా
- కనిగిరిలో వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు
- కనిగిరి బహిరంగ సభలో నారా లోకేష్

విశాలాంధ్ర- కనిగిరి : కనిగిరి కాటమరాజు ఏలినగడ్డ.. ఈ గడ్డపై యువగళం పాదయాత్ర చేయటం నా అదృష్టమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, ఇక్కడ గత ఎన్నికల్లో వైసిపి ఎనిమిది సీట్లు గెలిచింది మరో టిడిపి ఎమ్మెల్యేను చేర్చుకోవడం ద్వారా సంఖ్య తొమ్మిదికి పెరిగింది. ఇద్దరు ఎంపీలు ఉండి కూడా అభివృద్ధిని అటకెక్కించారు. ప్రజలు ఇచ్చిన గౌరవం నిలబెట్టుకొని జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా ప్రభుత్వం పని చేయాలి కానీ ఉమ్మడి జిల్లాకు జగన్ చేసిందేమీ లేదు హామీలన్నీ విస్మరించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు అభివృద్ధి జరగలేదని జగన్‌తో చెప్పే ధైర్యము లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఉమ్మడి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గురువారం కనిగిరి పామూరు బస్టాండ్ లో తెదేపా ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నారా లోకేష్ బహిరంగ సభలో మాట్లాడారు.

జగనాసుర రక్త చరిత్ర

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చలోక్తిగా ఇప్పుడు మీకు క్విజ్ పెడతాను. జగన్ స్పెషల్ ఫ్లైట్లులో మళ్లీ ఢిల్లీ ఎందుకు వెళ్లాడు.. మొదటి ఆప్షన్ బాబాయ్ మర్డర్ కేసులో ఏ8 గా ఉన్న అవినాష్ రెడ్డికి కాపాడటానికి, రెండో ఆప్షన్ ఏ నైన్ గా జగన్ పేరు పెట్టకుండా ఢిల్లీ పెద్దలు కాళ్లు పట్టుకోవడానికి, మూడో ఆప్షన్ నుండి భార్య భారతి రెడ్డిని కేసు నుండి తప్పించడానికి నాలుగో ఆప్షన్ పైవన్నీ ఇప్పుడు చెప్పండి.. అని ప్రజలు అడిగారు. పిన్ని పసుపు కుంకుమ చెరిపేసింది ఎవరు..? జగన్. అని ప్రశ్నించారు. చెల్లి పై నిందలు వేసిందేవ్ ఎవరు..? జగన్ .బాబాయ్ మర్డర్ ఎవరి రక్త చరిత్ర జగనాసుర రక్త చరిత్ర అని అన్నారు.

జగన్ కటింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కటింగ్ అండ్ ఫిట్టింగ్ మాస్టర్. జగన్ కి రెండు బటన్స్ ఉంటాయి ఒకటి బ్లూ బటన్ రెండవది రెడ్ బటన్ బ్లూ బటన్ నొక్కాగానే మీ అకౌంట్లో 10 పడుతుంది రెడ్ బటన్ నొక్కాగానే మీ అకౌంట్ వంద రూపాయలు పోతుంది. విద్యుత్ ఛార్జీలు 9సార్లు ఆర్టిసి బస్సు చార్జీలు మూడుసార్లు ఇంటి పన్ను చెత్త పన్ను పెట్రోల్ డీజిల్ నిత్యవసరం సరుకులు, కూరగాయలు బాదుడే బాదుడు అని అన్నారు.

జగన్ మహిళల్ని నమ్మించి మోసం చేశాడు

జగన్ మహిళల్ని ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని మహిళలకు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఏ పథకాలు అమలు చేయకుండా మోసం చేశారని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మహా శక్తి పేరుతో ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం ఆపిన అన్ని పథకాలు తెలుగుదేశం పార్టీ అమలు చేస్తుందన్నారు.

తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తానని, కనిగిరిలో టిట్కో గృహాలను వంద రోజుల్లోపు గృహప్రవేశాలు చేయించి లబ్ధిదారులకు పంపిణీ

చేస్తామన్నారు. బత్తాయి, పొగాకు రైతుల పడుతున్న కష్టాలు నాకు తెలుసునని, మార్కెటింగ్ అవకాశం తో పాటు గిట్టుబాటు ధర వచ్చేలా చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించిన ఎవరిని వదిలిపెట్టనని వడ్డీతో సహా చెల్లిస్తానన్నారు. కష్ట కాలంలో జెండా మోసిన కార్యకర్తలని గుండెల్లో పెట్టుకుంటానని లోకేష్ హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను వేధించిన అధికారులకు ఈ విధంగా హెచ్చరించారు. వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటుచేసి తెలుగుదేశం పార్టీ రాగానే అమలు చేస్తామన్నారు. బహిరంగ సభలో వేదికపై కనిగిరి ఇంచార్జ్ ఉగ్ర నరసింహారెడ్డి తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలు అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్, దామచర్ల జనార్ధన్, కొండేపి ఎమ్మెల్యే స్వామి, ఎరీక్షన్ బాబు, సత్య, నూకసాని బాలాజీ, ఎంఎం కొండయ్య యాదవ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీచర్ బదిలీ అక్రమాల్లో బీసీ ఉద్యోగుల సస్పెన్షన్ అన్యాయం

బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం

విశాలాంధ్ర - ఒంగోలు : టీచర్ల బదిలీల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు బాధ్యులుగా, బీసీ సామాజిక వర్గ అధికారిని, ఉద్యోగిని, టీచర్ను సస్పెండ్ చేయడం అన్యాయమని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పొటికలపూడి జయరాం అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జయరాం మాట్లాడారు. కంభం, కనిగిరి జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్లు గని వెంకటేశ్వర్లు, వేమూరి మాల్యాద్రిల బదిలీలు అక్రమమని అందిన ఫిర్యాదు మేరకు ఆర్జెడి వివి. సుబ్బారావు విచారణ జరిపారన్నారు. ఆర్జెడి నివేదిక మేరకు డీఈఓ కార్యాలయ ఏడి ఉదయభాస్కర్, ఏ సెక్షన్ సూపర్నెంట్ సురేష్ కుమార్, స్కూల్ అసిస్టెంట్ గిరిలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఐటీ సెల్ బాధ్యుడైన ఏఎస్ఓ కు సంబంధం ఉన్న విధి నిర్వహణలో జరిగిన తప్పులకు, ఏడి, సూపర్నెంట్లు బాధ్యులు ఎలా అవుతారో ఆర్జెడి సుబ్బారావు సమాధానం చెప్పా ల్సిన రోజు ముందుందన్నారు. ఆర్జెడి సుబ్బారావుకు ఏఎస్ఓ డ్యూటీలు కూడా తెలియక పోవడం సిగ్గుచేటు అన్నారు.

ఒకే స్కూల్లో : 8 సంవత్సరాల సర్వీసు ఉన్న టీచర్ల జాబితాను, సీనియార్టీ వైస్ ప్రమోషన్ లిస్టును తయారు చేయాల్సింది ఏఎస్ఓ అన్నారు. గని వెంకటేశ్వర్లు, వేమూరి మాలాద్రి కంపల్సరీ ట్రాన్సుర్స్ లిస్టులోకి వస్తారని, అదే సమయంలో ప్రమోషన్ లిస్టులో ఉన్నారన్నారు. వీరిని ట్రాన్సుర్స్ లిస్టులో కానీ, ప్రమోషన్ లిస్టులో కానీ ఎనేబుల్ లేదా డిజేబుల్ చేయాల్సింది ఏఎస్ఓ అన్నారు. స్కూల్ అసిస్టెంట్లు గని వెంకటేశ్వర్లు, వేమూరి మాలాద్రిలు చివరి నిమిషంలో తమకు ప్రమోషన్ వద్దని అన్విల్లింగ్ ఇచ్చారన్నారు.

అన్విల్లింగ్ ఇచ్చినప్పుడు వీరిద్దరి పేర్లను ఏఎస్ఓ ట్రాన్సుర్స్ లిస్టులో చేర్చలేదన్నారు. పైగా వీరిద్దరి కోసం రెండు పోస్టులను దాచి, ట్రాన్సుర్స్ వేకెన్సీ జాబితాలో ఆ ఖాళీలను చూప లేదన్నారు. ఈ మతలబుకు ఏడి, సూపర్నెంట్లు ఎలా బాధ్యులవుతారని జయరాం ఆర్జెడిని ప్రశ్నించారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత డిఇఓ తో మాట్లాడి, జాయింట్ డైరెక్టర్ రామలింగం అనుమతితో రెండు వేకెన్సీలని ఆన్లైన్లో చూపించలేదని చెప్పి, వెంకటేశ్వర్లు, మాల్యాద్రిలను తప్పుడు పత్రాలతో బదిలీ చేశారన్నారు. ఏఎస్ఓ జంపన కృష్ణకుమార్, స్కూల్ అసిస్టెంట్లు గని వెంకటేశ్వర్లు, వేమూరి మాలాద్రిల కాల్ డేటాలపై విచారణ జరిపించాలని జయరామ్ డిమాండ్ చేశారు. బదిలీ ఉత్తర్వులను డౌన్లోడ్ చేసి, ఆ ఉత్తర్వులపై పేర్లు మార్చి, ఆ పేర్లు స్థానంలో వెంకటేశ్వర్లు, మాల్యాద్రిల పేర్లు రాసి ఫోర్జరీ బదిలీ పత్రాలు ఇచ్చారన్నారు. ఇందుకు ఐటీ సెల్లో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న గిరి ఒక్కడినే సస్పెండ్ చేసిన ఆర్ జె డి కి, ఏఎస్ఓ తప్పులు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ధృతరాష్ట్రుడికి కూడా కనిపించే తప్పుల్ని చూడకుండా, ఆర్జేడి సుబ్బారావు గాంధారిలా కళ్ళకు గంతలు కట్టుకున్నారన్నారు. ఏఎస్ఓ జంపన కృష్ణ కుమార్ ను సస్పెండ్ చేసేంతవరకు, బీసీ ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేసేంతవరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు.

జీజీహెచ్‌లో మాతా శిశు సంరక్షణపై వర్క్ షాప్

- నురా హెల్త్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ
- ప్రారంభించిన జీజీహెచ్ సుపరింటిండెంట్

విశాలాంధ్ర - ఒంగోలు : మాతా శిశు రక్షణ చర్యలు మరియు అవగాహన కోసం నూరా హెల్త్ మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జిజిహెచ్ ఒంగోలులో ప్రారంభం అయింది. జిజిహెచ్ సూపరెండెంట్ డా భగవాన్ నాయక్ శిక్షణను ప్రారంభించారు. ప్రభుత్వ వైద్య రంగంలో పనచేస్తున్న స్టాఫ్ నర్సులు మరియు మిడ్ లెవెల్ ప్రొవైడర్స్‌కు మాతా శిశు సంరక్షణ పై పూర్తి అవగాహన కోసం ఈ రెండు రోజుల వర్క్ షాప్ ను జి జి హెచ్ లో నిర్వహించారు. కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ డా వాసవి ఈ వర్క్ షాప్ ను సమన్వయం చేశారు. ఏపి రిసోర్స్ పర్సన్ పి. గోపి కృష్ణ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ అనేది ముఖ్యమైన బాధ్యత అని, సులు సులభంగా, సరళమైన బాషలో తల్లి, బిడ్డ తీసుకోవల్సిన జాగ్రత్తలను చెప్పాల్సిన బాధ్యత ఉందని, అందుకోసం వివిధ రకాల ఇన్ఫర్మేటివ్ చార్ట్ లు, వివిధ మాధ్యమాలు ఉపయోగించి వారికి అర్థమ్యేలా చెప్పాల్సిన బాధ్యత ఉందని అన్నారు. వివిధ రకాల టూల్స్ ను ఉపయోగించి తల్లి వారి కుటుంబ సభ్యులకు ఎలా వివరించాలి అన్న దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. స్టాఫ్ నర్సుల కోసం నూర హెల్త్ ఐఈ సి మెటీరియల్ నిరంతరం అందిస్తోందని, ఒపి తదితర విభాగాల్లో తల్లులకు,. వారి సహాయకులకి పౌష్టికాహారం, ఏ సమయంలో ఎటువంటి పరీక్షలు చేయించుకోవాలి అన్న విషయాల పై అవగాహన పెంచుకోవాలి అని, మొబైల్ యాప్ ద్వారా కూడా సమాచారం లభ్యం అవుతుంది అని కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ డా తనూజ వివరించారు. నిరంతర శిక్షణ, కొత్త వైద్య ప్రక్రియలను తెలుసుకోవడం వైద్య సిబ్బంది విధి అని, నూరా హెల్త్ వారు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది అని డా భగవాన్ నాయక్ అన్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ వర్క్ షాప్ లో 300 పైగా హెల్త్ సిబ్బంది పాల్గొంటున్నారని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పలు ఆసుపత్రుల్లో వర్క్ షాప్ లు నిర్వహించామని కేర్ క్యాంపెయిన్ అసోసియేట్ డా వాసవి తెలిపారు. నర్సింగ్ సుపరెండేంట్ మరియు మాస్టర్ ట్రైనర్ లు, జి జి స్టాఫ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్..

- ప్రతి ఇంటికీ చేరువైన ప్రభుత్వ సేవలు
- జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జానకి వెంకట్ రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-ఒంగోలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం అపూర్వ రీతిలో ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను అందించి రికార్డుగా నిలిస్తోందని ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జానకి వెంకట్ రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలను మీడియాతో పంచుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించే ఇలాంటి కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గొప్ప చరిత్ర సృష్టించినందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా ఉండరాదన్న మహెూన్నత లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం జగనన్న ప్రభుత్వ నిబద్ధతకు ఉదాహరణగా నిలిచిందని దాని వివరాలు తెలిపారు.జూలై 1 నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష శిబిరాలు 15,004 సచివాలయాలకు గాను ఇప్పటివరకు 10,700 సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహించిందని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జానకి వెంకట్ రెడ్డి తెలిపారు. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కోసం మొత్తం 1.17 కోట్ల కుటుంబాల్లో సర్వే చేశామని పేర్కొన్నారు. అందులో 57.3 లక్షల మందికి ధ్రువ పత్రాలు అందించి వారికి నేరుగా ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. ఇప్పటి వరకు ఈ శిబిరాల ద్వారా 27 లక్షల(27,32,866) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24 లక్షల (24,46,599) ఆదాయ ధృవీకరణ పత్రాలు, 3,159 ఓబీసీ సర్టిఫికెట్లు, 5,199 ఫ్యామిలీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయని తెలిపారు. ప్రకాశం జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం గురించిన వివరాలు కూడా ఈ సందర్భంగా జానకి వెంకట్ రెడ్డి వెల్లడించారు. జిల్లాలో నేటికి మొత్తం 604 క్యాంపులను నిర్వహించినట్లు చెప్పారు. కాగా, జిల్లా వ్యాప్తంగా మొత్తం 56,9564 ఇళ్ల ఈ కార్యక్రమంలో సర్వే చేశారని తెలిపారు. ఈ భారీ విజయాన్ని సాధించిన ఘనత ప్రతి గ్రామ వలంటీర్‌కు కూడా చెందుతుందని, ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు వాలంటీర్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని అన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

- సీపీఐ (ఎం) ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా ప్రజల తాగునీటి అవసరం నిమిత్తం తక్షణమే సాగర్ నీటిని విడుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశ తీర్మానాలను సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పత్రికలకు విడుదల చేశారు. సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం రామతీర్థం తో పాటు 28 మంచినీటి పథకాలు ఉన్నాయి, గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 34 చెరువులు, సాగర్ కాలువ క్రింద 98 చెరువులకు జూన్ నెల చివరకు సాగర్ నీరు వదలాల్సి ఉంది, మంచినీటి పథకాలన్నీ అడుగంటి పోయాయి, సాగర్ నీటి మీద ఆధారపడిన స్కీములు, చెరువుల ద్వారా మంచినీరు పొందే ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతున్నది. జిల్లా మంత్రులు, అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసిన ప్రభుత్వం నుండి స్పందన రావడం లేదు, ప్రజల మంచినీటి సమస్య పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని సిపిఐ(ఎం) నిరసిస్తున్నది.. తక్షణమే త్రాగు,సాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ నీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుంది. ఈ సమావేశంలో సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్. మబూ, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం. రమేష్, డి.సోమయ్య, ఉసా వెంకటేశ్వర్లు, వి. ఆంజనే యులు పాల్గొన్నారు.

రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రామారావు, లలితకుమారి

- కూలీ సంఘం ఏపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మహాసభల ప్రదర్శన
- నూతన కమిటీ ఎన్నిక!

విశాలాంధ్ర-ఒంగోలు : రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) ప్రకాశం జిల్లా మహా సభలలో భాగంగా ప్రారంభ సభ అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో గత మహాసభల నుండి ఇప్పటి వరకు జరిగిన సంఘం కార్యకలాపాలను సమీక్షించు కుని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించు కోవడం జరిగింది. ఆ తర్వాత కామ్రేడ్ వేజండ్ల రామారావు అధ్యక్షులుగా, కామ్రేడ్ సిరిగిరి లలిత కుమారి కార్యదర్శిగా, కామ్రేడ్ పరిటాల కోటేశ్వర రావు సహాయ కార్యదర్శిగా, కామ్రేడ్ వాటంబేటి శ్రీరాములు కోశాధికారిగా మరో పన్నెండు మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది.మహాసభల అనంతరం ఒంగోలు వేమూరి కళ్యాణ మండపం నుండి ఏనుగు చెట్టు, అంబేద్కర్ విగ్రహం, చర్చి సెంటర్, నెల్లూర్ బస్టాండ్, రత్నమహల్ మీదుగా కలెక్టరేట్ వరకు జరిగిన ప్రదర్శనకు రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎం.ఎస్.నాగరాజు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ శిరిగిరి లలిత కుమారి, ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్.స్వామి, ఓ.పి.డి.ఆర్. జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కత్తి పేరయ్య రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, శ్రీరాములు, జయబాబు, శివరామకృష్ణయ్య తదితరులు నాయకత్వం వహించారు. "దున్నేవారిదే భూమి హక్కు" "వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి" "వెలుగొండ, గుండ్ల కమ్మ వెంటనే పూర్తి చేయాలి" అని నినదిస్తూ సాగిన ఈ ప్రదర్శనతో మహా సభలు ముగిశాయి.

దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పందుల బెడద

విశాలాంధ్ర - దర్శి : దర్శి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన కేంద్రం మరియు వ్యవసాయ పాల్ టెక్నికల్ కళాశాల ప్రాంతంలో ఊర పందులు స్వేరా విహారం చేస్తున్నాయి సంవత్సరాల నుండి పందులు ప్రవేశించి పంటలను, ట్రైల్స్ లో వేసిన విత్తనాలను, దున్నినాసనంచేస్తున్నాయని దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇన్చార్జి ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ డాక్టర్ ఎల్.రాజేష్ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం పూర్వపందులు వ్యవసాయ పరిశోధన కేంద్రంలోకి చొరబడి పాల్ టెక్నిక్ కళాశాలకు వచ్చి వేసిన పంటలను, మొలకెత్తినవిత్తనాలను,పంటలను తిని నాశనం చేస్తున్నాయని ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు కానీ, సంబంధిత అధికారులు కానీ పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయమైన విత్తనాలు అందించేందుకుఈ కేంద్రంలో వివిధ రకాల పరిశోధనలు చేయడం జరుగుతుందని, పందులు ఈ విధంగా వచ్చి పంటలను, మొలకెత్తిన విత్తనాలను,దున్ని నాశనం చేస్తుంటే ఏ విధంగా పరిశోధనలుచేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వగలమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులైన మున్సిపల్ అధికారులు పందులపై చర్యలు తీసుకొని పందుల్ని ఇక్కడి నుంచి తరిమికొట్టాలని పందుల్ని రాకుండా అరికట్టాలని ఆయన కోరారు.

కోప్పల్లికి ఘనంగా నివాళులర్పించిన బైరెడ్డి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు: కనిగిరి పట్టణంలో సీనియర్ న్యాయవాది కోప్పల్లి సుబ్బరాయుడికి గురువారం పామూరు లోని దారపనేని క్యాంపు కార్యాలయంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కొప్పల్లి సుబ్బరాయుడు నేటి న్యాయవాదులకు ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని, న్యాయవాద వృత్తికి వన్నెతెచ్చిన మేటి ఘనుడని దారపనేని, బైరెడ్డి పేర్కొన్నారు. నూతంగి నారాయణ, నూతంగి నరసింహారావు, నూతంగి లక్ష్మీ నారాయణ, గుర్రం వెంకటరాజా(పులి) నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - దర్శి: దర్శి సాయి ఆశ్రమంలో ని వృద్ధులకు శివాజీ నగర్ కి చెందిన పోరుమామిళ్ల నరేష్ రమ్య ల పుత్రిక చైతన్య నిషిత పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానము పండ్లు మిఠాయిలు మరియు కేక్ కటింగ్ చేసి పంచి పెట్టారు. వారి కుటుంబ సభ్యులు ఆశ్రమ నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో ఇరిగినేని, గుర్రం

విశాలాంధ్ర-పామూరు: భవిష్యత్తుకు హామీ ఇస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నారా లోకేష్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర అడుగడుగునా జననీరాజనంతో ముందుకు సాగుతూ కనిగిరిలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా గురువారం స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు కుమారుడు ఇరిగినేని రవీంద్రబాబు, మేనల్లుడు గుర్రం వెంకటేశ్వర్లు నారా లోకేష్ ని కలిసి యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ వారితో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, పార్టీలో పని చేసే వారికి సముచితస్థానం ఉంటుందన్నారు.

ఇవగళం పాదయాత్రలో ఏలూరి



విశాలాంధ్ర-పామూరు: భవిష్యత్తుకు హామీ ఇస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నారా లోకేష్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర అడుగడుగునా జననీరాజనంతో ముందుకు సాగుతూ కనిగిరి లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా గురువారం ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరు వెంకటేశ్వర్లు లోకేష్ బాబు ని కలిసి యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

అవి అసలు విత్తనాలేనా..!

- పట్టుబడ్డ మిర్చి విత్తనాలపై సందేహాలు
- వ్యవసాయ అధికారుల తీరుపై అనుమానాస్పదం



విశాలాంధ్ర - అర్ధవీడు: మండలంలో అమ్మకాలు జరిగిన మిర్చి విత్తనాలు అసలైనవేనా ? లేక నకిలీవా ? అనే అనుమానాలు రైతుల నుండి వినిపిస్తున్నాయి. ఇందుకు వ్యవసాయాధికారుల దోబూచులాట కారణంగా కనిపిస్తోంది. మండలంలోని అర్ధవీడు, పాపినేనిపల్లిలోని ఓ రెండు విత్తన దుకాణాల్లో గత సోమవారం స్థానిక ఏ ఓ షేక్ మహమ్మద్, స్క్వాడ్ అధికారి దర్శి ఏ డి ఏ కె బాలాజీనాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ 80,250 విలువగల 1.3 కేజీల సంకరజాతి మిర్చి విత్తనాల అమ్మ కాలను నిలిపేశారు. ఇందుకు దుకాణ దారులు పిసి (విత్తనాల అమ్మకపు అనుమతి పత్రం) చూపలేదని తనిఖీ అనంతరం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో అధికారులు పేర్కొన్నారు. ఈ విషయం చెప్పిన వారు అవి ఏ కంపెనీ విత్తనాలు, ఏ వెరైటీ, బ్యాచ్ నెంబర్, లాట్ నెంబర్ , చివరికి దుకాణాల పేర్లుకాని ప్రెస్ నోట్ లో పేర్కొనలేదు. ఈ వివరాలను అధికారులు దాచడం, ఆ విత్తన దుకాణాల్లో ఒకదానికి నకిలీ అమ్మకాల చరిత్ర ఉండడం రైతులను కలవర పెడుతోంది. తానికీల్లో పట్టుబడిన విత్తనాల తాలూకు కొనుగోలు చేసిన రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి ఇచ్చిన వివరణ సందేహాలు నివృతి కాకపోగా మరింత బలాన్నిస్తోంది. పట్టుబడ్డ విత్తనాలు నాథ్ సీడ్స్, రవీ సీడ్స్ కంపెనీలకు చెందినవని ఆ తరువాత తెలిపారు.నాథ్ సీడ్స్ విత్తన ప్యాకెట్ పై వున్న ట్రూత్ ఫుల్ లేబుల్ ఫోటోను చూపారు. పాకెట్ కాదు. ఇవి కంపెనీ విత్తనాలే అని రుజువు కోసం ఆ కంపెనీ లెటర్ హెడ్ తో వున్నా పి సి కాపీ వాట్సాప్ ఫోటో చూపారు. దీనిని దుకాణదారు తనకు పంపారని చెప్పారు. ఆ పత్రంలో డీలర్ పేరు లేదేమి ప్రశ్నించగా..20 రోజుల గడువులో రాసి ఇస్తారని బదులిచ్చారు. దీనితో కంపెనీ డీలర్ పేరు రాయకుండా ఖాళీ పత్రం ఎలా ఇస్తుంది? అనే ప్రశ్న ఉదయించింది. దీనికి సమాధానంగా ఏ ఓ గుచ్చి గుచ్చి అడిగితే తానేమి చేయలేనని దాటేశారు. తామిచ్చిన గడువులోపు పత్రాలు చూపిస్తే అమ్మకాలకు అనుమతినిస్తామన్నారు. అవసరమయితే జెడిఏను అడగొచ్చని సూచించారు. రవి సీడ్స్ వివరాలు లేవని చెప్పారు. సహజంగా విత్తనాలతోపాటు కంపెనీలు పిసిలు తన డీలర్కు ఇస్తాయి. మూడు సందర్భాల్లో డీలర్ వద్ద పిసిలు అందుబాటులో ఉండవని విత్తన వ్యాపారి ఒకరు చెప్పారు. భద్రత దృష్ట్యా ట్రాన్స్పోర్ట్ సమస్య వల్లనో, భౌతికంగా డీలర్ అందుబాటులో లేకపోతే అనుమతి పత్రాలు వెంట రావని చెబుతున్నారు. అసలును పోలిన నకిలీ అయితే అనుమతి పత్రాలు సృష్టించాల్సిందేనని అంటున్నారు. అసలు కంపెనీకి సంబంధం లేని డీలరుకు అనుమతి పత్రాలు ఉండవని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల దాపరికం నకిలీని అసలు చేసే ప్రయత్నమా ? లేక ఇంకేదైనా లొసుగును సానుకూలంగా మార్చుకునే యత్నమా? అనే సందేహాలు వెంటాడుతూనే ఉంటాయి.

అడుగడుగునా యువగళం పాదయాత్రకు ఆటంకాలు

అధికార యంత్రాంగం ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఉగ్ర పిలుపు

విశాలాంధ్ర -కనిగిరి : కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎందుకు అధికార యంత్రంగా మరుగడుగున ఆటంకాలు ఎదుర్కోవల్సిన పరిస్థితి ఏర్పడిందని టిడిపి శ్రేణులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. పామూరు బస్టాండ్‌లో జరుగుతున్న బహిరంగ సభను విజయవంతం కాకుండా చేయాలని దురుద్దేశంతో ప్రతిపక్షం అధికార యంత్రం ద్వారా ఆటంకాలు సృష్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బి అధికారులతో పాటు బహిరంగ సభకు వస్తున్న ఆటోలను బ్రేక్ ఇన్స్పెక్టర్ ఆపి జరిమానా విధించడం, ఫ్లెక్సీలు కట్టే అభిమానులను బెదిరించడం, కట్టిన ఫ్లెక్సీలను వారి చేతనే చింపించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లును అడ్డుకునేందుకు ఆర్ అండ్ బి అధికారులు ప్రయత్నించడం నాయకులపై కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. అధికార యంత్రాంగం ఆటంకాలు కనిపించిన యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువకులం పాదయాత్ర విజయవంతం చేయాలని కరిగిరి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కార్యకర్తల్లో ధైర్యం నింపేలా పిలుపునిచ్చారు. దీంతో టీడీపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహంతో పాదయాత్రను విజయం చేసేందుకు ముందుకు కదలారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదుకుంటాం : జడ్పీటీసీ గుంటక

విశాలాంధ్ర -వెలిగండ్ల: ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా జడ్పిటి సంఘం అధ్యక్షులు వెనిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గత కొంతకాలంగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను జడ్పీ నిధుల నుంచి 50 వేల రూపాయల చెక్కును పాఠశాల సిబ్బందికి అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని అందులో భాగంగా ప్రజా ప్రతినిధులమైన మేము ప్రజలు మాపై ఉంచినటువంటి బాధ్యతను తప్పక నిర్వర్తిస్తామని అందులో భాగంగానే వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 50 వేల రూపాయలు చెక్కును విద్యుత్ బకాయిల కొరకు అందజేయడం జరుగుతుందని అన్నారు ఈ క్రమంలో పాఠశాల సిబ్బంది జెడ్పిటిసిని సాల్వతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వెలిగండ్ల ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్ రెడ్డి నాగూర్ యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మండల సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గంజి రవీంద్రారెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

25న విద్యారంగ సమస్యలపై రాష్ట్ర బంద్

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 25 వ తేదీన ఏఐఎస్ఎఫ్, టీయన్ఎస్ఎఫ్, ఎన్.యస్. యు.ఐ, పిడిఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఏఐడిఎస్ఓ విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిస్తున్నా మని జిల్లా ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ ముండ్ల జాన్ తెలిపారు. జాన్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను తక్షణమే పంపిణీ చేయాలన్నారు. విలీనాన్ని విర మించుకుని ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టా లన్నారు. ఇంటర్మీ డియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసా గించాలని అదే విధంగా హాస్టల్ విద్యార్థులకు పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. కార్పొరేట్ కళా శాలలో, పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి విద్యా హక్కు చట్టా న్ని అమ లు చేయాలన్నారు. ఫీజు రియం బర్స్మెంట్ బకాయిల నిధులను తక్షణమే విడుదల చేయాలని డిగ్రీ విద్యా విధా నంలో ప్రవేశపెడుతున్న మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని విరమించు కోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ముండ్లమూరు : (మండలంలోని తమ్మలూరు గ్రామానికి చెందిన చొప్పరపు గంగయ్య(54) ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళ వారం దర్శి అద్దంకి ప్రధాన రహదారిలో చిలక లేరు వాగు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గంగయ్య తల కు బలమైన గాయాలు అయ్యాయి. దీంతో అతనిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మధుసూదన్ కాదు 'మనీ' సుధన్

టీడీపీ యువనేత లోకేష్ ఆరోపణ

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ అవినీతిపరుడని, అవినీతి చేయటంలో పీహెచ్డీ చేశాడని మధుసూదన్ పేరును మనీసూదన్ అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో ఆరోపణ చేశారు. కనిగిరిలో అభివృద్ధి నిల్ .. అవినీతి ఫుల్ గా ఉందన్నారు. ఉపాధి హామీ పనులు చేయకుండానే.. రోడ్లు వేయకుండానే బిల్లులు కా చేశారని ఆరోపణ చేశారు. వెలిగండ్ల మండలం అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ కర్రను ఎమ్మెల్యే అనుచరులు ఏదేచ్ఛగా స్వాహా చేశారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే 100 కోట్ల స్వాహా చేశారన్నారు. భూ కబ్జాలకు అడ్డుపడ్డారని ఎమ్మార్వో ను సస్పెండ్ చేశారన్నారు. వెలిగండ్ల మండలంలో తహసిల్దార్ కార్యాలయం ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 349/2 భూమిని ఎమ్మెల్యే వాళ్ళ అనుచరులు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకున్నారన్నారు. ఇసుక, మట్టితో పాటు పేదలు తినే రేషన్ బియ్యాన్ని కూడా వదలలేదని రేషన్ బియ్యం మాఫియాగా కనిగిరి మారిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే చేసిన అవినీతిపై విచారణ జరుపుతామన్నారు.

ఘనంగా రక్షణ సైన్యం వార్షికోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : రక్షణ సైనం 18వ వార్షికోత్సవం బాపట్లలో గురువారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల డివిజన్‌లోని అన్నీ సంఘాల రక్షణ సైన్య సంఘ కాపరులు, సంఘ పెద్దలు, గృహ సమితి సభ్యులు, యవనస్తులు పట్టంలోని ప్రధాన కూడలి కొత్త బస్టాండ్ దగ్గర నుండి బైకులు కార్లుతో ర్యాలీ నిర్వహించి వీధులలో రక్షణ సైన్యం జెండాను ఎగురవేశారు.

పాదయాత్రకు తరలిన టీడీపీ కార్యకర్తలు

విశాలాంధ్ర -వెలిగండ్ల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ యువగలం పాదయాత్ర చివరి రోజు కనిగిరిలోని పామూరు బస్టాండ్ వద్ద లోకేష్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించినందున వెలిగండ్ల నుండి భారీగా ప్రజలు కార్యకర్తలు తెలుగుదేశం అభిమానులు బయలుదేరి వెళ్లారు ముఖ్యనాయకులు మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గౌదకట్ల హరికృష్ణ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి, మండల ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్, తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, యద్దనపూడి సాల్మన్ రాజ్, కొండు భాస్కర్ రెడ్డి, వెన్న రమణారెడ్డి, కొండు శ్రీనివాసరెడ్డి, చందా బాలకాశి రెడ్డి, బొబ్బ తిరుపతిరెడ్డి, శ్రేష్ఠ ఫౌండేషన్ అధ్యక్షులు తగరం ఇమ్మానియేల్, కీసర రమణారెడ్డి బయలుదేరారు.

సోమేపల్లిలో నీటి వనరులు గుర్తింపు

విశాలాంధ్ర-పెద్దారవీడు: మండలంలోని సోమేపల్లి గ్రామంలో ఎఫర్ట్ సంస్థ జెవి మోహన్ రావు రిలయన్స్ బాబురావు ఆధ్వర్యంలో గ్రామంలోని ట్యాంకులు,మంచినీటి లభ్యత అంశాలపై ప్రజలతో కలిసి విలేజ్ మ్యాపింగ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన నీటి వనరుల ను గూర్చి కనుగొన్నామని,దాని తర్వాత గ్రామంలోని నీటి వనరులను గుర్తించి అంచనా నివారణ, ప్రాణాలికలను రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూ శివ,పిసి జిగిషా, జగన్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్సలు

విశాలాంధ్ర- కంభం : కంభం పట్టణంలోని వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అరుదైన అత్యంత ప్రమాదకర చికిత్సలు కూడా సులువుగా అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్సలు అందిస్తున్నారు. గురువారం హాస్పిటల్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. బేస్తవారిపేట మండలం ఖాజీపురానికి చెందిన కె.అజయ్ కుమార్, 21 సంవత్సరాలు ఇతనికి అరుదైన విషపూరిత మైన జాతికి చెందిన రక్త పింజరి, పాము కాటుకు గురై అస్వస్థతకు లోనై హాస్పిటల్ రాగా అప్పటికే చూపు పూర్తిగా మందగించడం, మూత్రంలో రక్తం రావడం జరిగింది. ఇటువంటి రెండు లక్షణాలు ఒకే పేషెంట్ కు రావడం చాలా అరుదుగా వస్తుంది. వెంటనే డాక్టర్లు స్పందించి పాము విషంకు సంబంధించిన విరుగుడు అందించి రక్తస్రావం కంటి చూపును 48 గంటల్లో పేషెంట్ కు సాధారణ స్థితికి తీసుకుని రావడం జరిగింది. కంభం పట్టణానికి చెందిన షేక్. అబ్దుల్ లతీఫ్, వయస్సు 62 సంవత్సరాలు అను వ్యక్తికి పక్షవాతం లక్షణాలతో కుడి చేయి మూతి వంకర మాటలు సరిగా రాకుండా ఉండడం వలన ఆసుపత్రికి వచ్చారు, డాక్టర్లు వెంటనే స్కానింగ్ చేసి బ్రెయిన్ లో రక్తం గడ్డ కట్టిన దానికి ఇంజక్షన్ వేసి వైద్యం చేశారు. హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ ఇలాంటి అత్యవసర కేసులకు వేరే ప్రాంతాలకు వెళ్లకుండా, ఇప్పుడు కంభం లోనే వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో మెరుగైన వైద్య సేవలు జనరల్ మెడిసిన్ మరియు ఎమర్జెన్సీ కేర్ నందు డాక్టర్. ఎం. వి. సందీప్ కుమార్, పర్యవేక్షణలో 24 గంటలు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

దివ్యాంగునికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో దివ్యాంగునికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసీపీ నియోజకవర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ చేతుల మీదుగా మండలంలోని తోటవారిపాలెం, వీవర్స్ కాలనీకి చెందిన పేద దివ్యాంగుడైన పొట్టేటి సాయికి జైపూర్ పాదములు అమర్చుకొనుటకై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.15 వేల, డా. ఐ బాబూరావు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు.

జగనన్న పాలవెల్లువ కేంద్రాలు సక్రమంగా జరిగేటట్లు చూడాలి

విశాలాంధ్ర - ముండ్లమూరు: జగనన్న పాల వెల్లువ కేంద్రాలు సక్రమంగా జరిగేటట్లు వివో ఏలు కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ (జేడీఎం) రజినీకాంత్ అన్నారు. స్థానిక వైయస్సార్ క్రాంతి పదం కార్యాలయంలో గురువారం వివో ఎలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలలో పాలు పోసే వారి సంఖ్య తగ్గకుండా ఎక్కువ మంది పాలు పోసే విధంగా కృషి చేయాలి అన్నారు. ఏరియా కోఆర్డినేటర్ వసుంధర దేవి మాట్లాడుతూ మొబైల్ బుక్ కీపింగ్‌లో 100% పూర్తిచేసి ఏ గ్రేడ్ లో వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. స్త్రీనిధి మేనేజర్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా తీసు కున్న రుణాలను త్వరితగతనచెల్లించి మరలా రుణాలు పొందాలన్నారు. జగ నన్న పాల వెల్లువ ఏపిఎం సుబ్బారావు మాట్లాడుతూ అన్ని రకాల గ్రూపుల ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించేందుకు కృషి చేయాలి అన్నారు. వైకెపి ఏపిఎం ఎం హనుమంతరావు మాట్లాడుతూ వివో ఏలు గ్రామాలలో సంఘాలలోని మహిళల తో సమావేశాలు ఏర్పాటు చేసి తీసుకున్న రుణాలు చెల్లించి మరలా రుణాలు పొందేందుకు కృషి చేయాలన్నారు. తీసుకున్న రుణాలతో ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెంది ఆదాయ అభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు మోహనరావు, గురవయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల పాఠశాలకు బీరువా బహూకరణ

విశాలాంధ్ర -నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ ఏకేజీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బీరువాను బుధవారం అందజేశారు. ఇటీవల ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ బ్యాచ్ తరపున రూ.15 వేలు విలువైన బీరువాను పూర్వ విద్యార్థుల చేతుల మీదగా హెచ్.ఎం పీ.చలపతికి అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన పూర్వ విద్యార్థులను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 టి.రవి, ఎంఈవో-2 ఈమని వెంకటరమణయ్య పూర్వ విద్యార్థి, చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, కల్లూరు ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మి, విశాఖ జిల్లా మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ యాదల అనిల్, విశ్రాంత సైనికుడు వై శ్రీహరిరెడ్డి, కోయి శ్రీహరినాథ్, జ్యోతుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

23న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర -నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు గ్రామంలోని ఏకేజీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 23న ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 1995-96 నాటి పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరవు తారన్నారు. నాటి గురువులకు సన్మానం, పూర్వ విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.పూర్తి వివరాలకు కే విజయ్ కుమార్ 9885661189, కొలకలూరి బాలాజీ 7981172145 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లోకేష్ బాబు సభకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-పామూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర గురువారం సాయంత్రం కనిగిరి కి చేరుకున్నది. ఈ సందర్భంగా పామూరు బస్టాండ్ చర్చి సెంటర్ లో జరుగు బహిరంగ సభకు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, ఏలూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు భారీ ఎత్తున వాహనాల్లో తరలి వెళ్లారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ ల పై జరుగుతున్న దాడులు, సంక్షేమ పథకాలు కుదింపు తదితర విషయాలపై నారా లోకేష్ బాబుకు వినతి పత్రం అందజేసేందుకు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు డోలా శేషాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలలో మండలం నుంచి బయలుదేరి వెళ్లారు.

వైఎస్సార్ క్రాంతి పథం కార్యక్రమాలపై సమీక్ష

విశాలాంధ్ర -కొనకనమిట్ల : వైయస్సార్ క్రాంతి పదం కార్యక్రమాలపై మండల కేంద్రమైన కొనకనమిట్లలోని వైయస్సార్ క్రాంతి పదం కార్యాలయంలో డి ఆర్.డీఏ పిడి టి రవికుమార్ ఆదేశాల మేరకు ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ ఆధ్వర్యంలో విఓఏలకు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు ప్రత్యేక అధికారి డిపిఎం బి కృపారావు బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ పి సుబ్బారావు శ్రీనిధి మేనేజర్ సులోచన నాగభూషణం ఏపిఎం గోపాలకృష్ణ లు వివోఏలకు మొబైల్ కీపింగ్ గైడింగ్ శ్రీనిధి ఉత్పత్తి సిఐఎఫ్ బ్యాంకు లింకేజీ రుణాలు ఉమెన్ ఎంటర్ప్రైజెస్ వైఎస్ఆర్ చేయూత సేల్ఫ్ వర్క్ డన్ ఎఫ్ పీ జి గ్రూపులో ఏర్పాటు అన్ని అంశాలపై రివ్యూ నిర్వహించారు వారికి సూచనలు సలహాలు చేశారు ఈ కార్యక్రమంలో సీసీలు వేల్పుల ఎజ్రా రామయ్య రాజయ్య, వెంకటరెడ్డి, సురభయ్య వివోఏలు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి ఓట్లు గుర్తించాలి

విశాలాంధ్ర -ముండ్లమూరు: బిఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓట్లు గుర్తించాలని ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ఎ ప్రవంతి అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో గురువారం బిఎల్ఓలతోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్వోలు డోర్ టు డోర్ తిరుగుతూ ప్రతి ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో గుర్తించాలని, ఓటుకు అర్హత ఉన్న యువతీ యువకులను గుర్తించాలని అన్నారు. చనిపోయిన వారి ఓటర్లను శాశ్వతంగా తీసివేయాలన్నారు. ఓటర్ గుర్తింపు కార్డులో ఫోటో సరిగా లేకపోతే మరలా ఫోటో పెట్టుకోవాలని సూచించారు. ఓటర్ గుర్తింపు కార్డులో ఇంటిని నెంబర్ లేకపోతే మరలా ఇంటి నెంబరు సరి చేయించు కోవాలన్నారు. ఓటర్ల పేరు తప్పు ఉంటే మరల రాయించు కోవాలన్నారు. ఈనెల 21 నుండి ఆగస్టు 21 వరకు డోర్ టు డోర్ తిరిగి మార్పులు చేర్పులు చేర్పు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జిపుల్లారెడ్డి, బిఎల్ఓ లు పాల్గొన్నారు.

లోకేష్ బహిరంగ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరిలో జరిగే యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం పామూరు బస్టాండ్ లో జరిగే బహిరంగ సభకు కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, సిఎస్పురం, పీసీ పల్లి, హనుమంతునిపాడు మండలాల నుంచి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేల సంఖ్యలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రైవేటు బస్సులు, కార్లు, ఆటోలు ఇతర వాహనాల్లో ఉదయం నుంచే కనిగిరికి చేరుకున్నారు. పాదయాత్ర అడుగులో అడుగు కలిపి పాటు బహిరంగ సభ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో శ్రేణులు పాల్గొన్నారు.